**ఈ వారం కథ**



# ఫైనల్ టెస్ట్

– ఎన్.కె. నాగేశ్వరరావు

**ఒకటి కాదు రెండు కాదు సరిగ్గా వారం ... వారం రోజులయ్యింది ఆ ముసలామెను బయటవేసి.**

**ఏరోజుకారోజు చచ్చిపోతుందనే అనుకుంటున్నారంతా.**

**అయినా ఆ ముసలి ప్రాణం ఎక్కడ చిక్కుకు పోయిందోగానీ, 'పోవడం' లేదు.**

ప్రతిరోజూ డాక్టరుగారు వస్తున్నారు.

ఆమె నాడి పట్టుకు చూస్తున్నారు. 'ప్చ్ ...' అనే శబ్దం ఆయన పెదవుల చివరల్నుంచి వస్తుందేమోనని ఆశ అందరిలో. కానీ, అలా జరగడంలేదు.

"ఇంత గట్టి ప్రాణం నా పాతికేళ్ళ వైద్యవృత్తిలో ఎక్కడా తగల్లేదు" ఇదే, నాడి చూసిన ప్రతిసారీ డాక్టరుగారు అనే మాట.

ధనుర్మాసం ...

మంచులా గడ్డకట్టించే చలిరోజులు.

ఇంటిముందు రోడ్డుకు చేర్చి, చుట్టూ డేరాలు కట్టి, ముసలామెను పడుకోబెట్టి ప్రతిరాత్రీ కాపలా కాస్తున్నారు. పగలు కూడా అదేపని. ఇలా ఎన్నిరోజులు ఎదురుచూస్తూ వుండగలరు?

ఎనమండుగురు కోడళ్ళు. దాదాపు పాతికమంది వుంటారేమో మనవలూ, మనుమరాళ్ళూ ...

తల్లిప్రాణం 'వచ్చే ప్రాణం – పోయే ప్రాణం'గా వుందని అన్నగార్లు కబురు పంపగానే ఆయా ఊళ్ళనుండి ఆదరాబాదరాగా రెక్కలు కట్టుకొని దిగిపోయిన అరడజను మంది కూతుళ్ళు ... వాళ్ళ భర్తలు ... వారి సంతానం ...

అందరికీ ... అందరికీ ముసల్ది చచ్చిపోకుండా ఇంకా తమని చంపుతోందనే బాధ.

ఆ రోడ్డున పోయేవాళ్ళకి డేరాలో గడ్డిమీద ముసల్ది ... ఆమె చుట్టూ పురుగూ, పుట్రా చేరకుండా గమేక్సన్ పొడి ... చుట్టూ సంతానం ... ఇవన్నీ వింతగానే కనిపిస్తున్నాయి. వాళ్ళలో ఎవరో ఒకరు విసిగిపోయి –

"మీ దుంపతెగా! ఎనభైఏళ్ళున్న ఆ ముసల్దాన్ని ఇంట్లో చావనివ్వకుండా చలిలో వుంచి చంపుతున్నారు కదంట్రా ..." అని, ముఖాన్నే అనేస్తున్నా పట్టించుకోవడమే మానేశారు వాళ్ళంతా.

అసలే కరువురోజులు. ఏ దుర్ముహూర్తంలోనో ఇంట్లో చచ్చిందంటే ... హమ్మో ...! కీడుపోయేవరకూ ఇల్లు ఖాళీచేసి, మొత్తం అంతా అద్దె కొంపకు పోవాల్సిందే. పెద్ద పెద్ద గదుల్తో మండువా లోగిళ్ళతో వున్నా దగ్గర దగ్గర యాభైమంది వున్న తమకే ఈ ఇల్లు సరిపోవడంలేదు. ఆ ప్రకారం చూస్తే నాలుగైదు పెద్ద పెద్ద అద్దె కొంపలకోసం కాళ్ళరిగేలా తిరగాలి.

అదిగో ... అందుకోసమే ... ఎవరు తిడుతున్నా, ఎందరు కాండ్రించి ఉమ్మేస్తున్నా చలించడంలేదు వాళ్ళు.

* * *

అలాగే మరో రెండు రోజులు గడిచాయి.

ప్రతీరోజులాగే డాక్టరుగారు వచ్చారు.

నాడి పట్టుకు చూసి, పెదవి విరవలేదు. 'ప్చ్' అని అనలేదు. ఎప్పటిలాగే తన సర్వీసును తలచుకొని, ముసలామెకో దండం పెట్టి వెళ్ళిపోయారు.




తల్లి ప్రాణం కాస్తా గుటుక్కుమంటే ఆమె ఒంటిమీద నగలన్నింటినీ వొలిచేసుకొని ... ఆరు సమాన వాటాలు వేసేసుకొని ... చక్కా పోదామనుకున్న ఆ ఇంటి ఆడపడుచులకి మొగుళ్ళ సాధింపు కంటకంగానే వుంది.

"మీ అమ్మ చావదుగానీ ... ఇంకెన్నిరోజులు సెలవు పొడిగించం మేము. పదండి ... పదండి ..." అంటూ వాళ్ళు బయల్దేరదీస్తే వెళ్ళిపోక తప్పిందికాదు.

పైగా, "ఒరే అన్నయ్యలూ ... ప్రాణం పోగానే ఫోన్ చేయడం మరచిపోకండే" అని చెప్పే కదిలారు అందరూ.

కూతుళ్ళంటే వెళ్ళిపోయారుగానీ, ఆ ఇంటి కోడళ్ళకు కొలువు తప్పలేదు.

అత్తగారి గట్టిపిండాన్ని చూసి వాళ్ళు పైకే తిట్టేసుకుంటున్నారు.

కొడుకులకు కొంత విసుగ్గానూ, మరికొంత బాధగానూ వుంది. రోడ్డున పోయే ప్రతీవాడూ తమని నరరూప రాక్షసుల్లాగే చూస్తున్నారు మరి.

పదోరోజో ... పదకొండోరోజో ...

డాక్టరుగారు రాకుండానే, అన్నిరోజులూ కళ్ళుమూసుకొనే వున్న ఆ ముసలామె అప్పుడే నిద్రలేచిందాన్లా కళ్ళు విప్పి అందర్నీ చూసింది.

పెదవి విప్పి, పేరు పేరునా అందర్నీ పిలిచింది.

చచ్చిపోతుందనుకున్న తల్లి 'తన ప్రాణం తీయవచ్చిన యమభటుల్ని తలా ఓ తన్ను తన్ని' బ్రతికేసినందుకు ఆశ్చర్యపోతూనే అతి వినయంతో ఆమె ముందుకు చేరిపోయారు కొడుకులు ... ఆ వెనకే కోడళ్ళు ... మనుమలు ... మనుమరాండ్రు.

అన్నిరోజులూ కళ్ళు మూసుకొని శవంలా పడున్నా, ఆమె చెవులు మాత్రం తమపని చేసుకుపోయాయని ... వాటిద్వారానే అక్కడ అందరి విసుగులూ ... వ్యాఖ్యానాలూ ... తిట్లూ ... శాపనార్ధాలు ఆమె వినదని వాళ్ళకు తెలీదు.

"మీ నాన్నగారు తను పోతూ పోతూ నా పేరుమీద పెట్టిన ఆస్తి మీ అందరికీ రాయాలనే అనుకున్నానర్రా ... కానీ, ఇప్పుడలా అనిపించడంలేదు ... ఎందుకంటే ..." మాట్లాడుతూ, మాట్లాడుతూ ఆగిందామె.

ఆమె మాటలకు ఖంగుతిన్న వాళ్ళంతా ఆమె మాట్లాడ్డం ఆపడంతో 'కొంపదీసి ప్రాణం పోలేదుకదా' అనుకుంటూ గతుక్కుమన్నారు.

అందరివంకా చూసి ముసలామె నవ్వింది.

"మీకు తెలీదర్రా ... విల్లు నేను ఏడాది క్రిందటే రాయించి, రిజిష్ట్రీ చేయించాను. ప్లీడరు దగ్గరే వుందది. ఆస్తంతా నా మనవలూ, మనుమరాండ్రకే చెందాలనే రాయించాను. అది రాయించిన తర్వాత, మీకెందుకు రాయలేదాని బాధపడ్డాను. అందుకే చావురాక ఈ చలిలోపడి నరకయాతన అనుభవించాను. నిజంగా ఇది మీకు నేను పెట్టిన ఆఖరి పరీక్షేమో! ... కానీ, మీరంతా పరీక్షలో తప్పార్రా ... మీకంటే ఈ పిల్లలే నయం. నానమ్మని ఒక్క మాటా నిందిస్తూ అనలేదు. అది తెలుసుకొందుకే ఈ ప్రాణం ఆగిందేమో ... కాస్త తులసితీర్థం పోయండ్రా ఎవ్వరైనా. ఇహ ... మిమ్మల్ని విసిగించను ..."

ఆఖరి మాటలు చెప్పేసింది ఆ ముసలామె.

అయితే, ఆమె ఆఖరి కోరిక తీర్చడానికి మాత్రం అక్కడివాళ్ళకు చేతులాలేదు. ఆస్తి బొడ్డూడని తమ పిల్లలకు రాసి ... స్వేచ్ఛగా ఆ ఆస్తి అనుభవిద్దామనుకున్న తమ నోట్లో నిజంగా 'మట్టే' కొట్టిన ఆమెపై కొడుకులకూ, కోడళ్ళకూ పీకల్దాకా కోపంగా వుంది.

ఆ కోపానికి ఇంట్లో అయితే పీకపిసికి చంపేసేవారేమో ... వీధిలో కనుక ఆగిపోయారు. మరికొద్ది క్షణాలకి –

తులసితీర్థం పోయకుండానే ... డాక్టర్‌గారు వచ్చి నాడి చూసి 'ప్చ్ ...' అని చెప్పకుండానే ముసలామె ప్రాణం ఎగిరిపోయింది.

అంతక్రితం అన్నిరోజులూ కళ్ళువిప్పని ఆమె చుట్టూచేరి ఏడ్చినవారందరికీ గొంతూ పెగలడంలేదూ ... కన్నీరూ ఉబకడంలేదు ... ఇప్పుడు! ◆

